వంతెన సమస్య తీరేనా?

- రైల్వే బ్రిడ్జిపై తరచూ ప్రమాదాలు
- ఇరు వైపులా శిథిలావస్థకు చేరిన దిమ్మెలు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ రైల్వే బ్రిడ్జి సమస్యలు తీవ్రమవుతున్నాయి. మూడు దశాబ్దాల క్రితం ఈ వంతెన నిర్మించడంతో అది శిథిలావస్థకు చేరి, గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. పైగా రెండు చోట్ల రోడ్డు ఒంపుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. ఇక రాత్రి సమయాల్లో సమస్యలు చెప్పనలవి. ప్రమాదాలను నివారించేందుకు గతంలో కలెక్టర్ పౌసమి బసు.. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించే విధంగా మిర్రర్ ఏర్పాటు చేయించారు. ఇప్పుడు అవి దుమ్ముధూళితో నిండి కనిపించడం లేదు. చెన్నారెడ్డి విగ్రహం నుంచి ధర్మవిద్యాలయం పాఠశాల వరకు ఉన్న రైల్వే బ్రిడ్జికి రెండు వైపులా అప్పట్లో దిమ్మెలు నిర్మించారు. అవీ ధ్వంసమయ్యాయి. గంగారం, ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లడానికి బ్రిడ్జిపై ఒక చోట మెట్లు నిర్మించారు. ఇప్పుడు ఆ మెట్లు తొలగించడంతో ప్రమాదకరంగా మారింది. వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదం తప్పదు. ఒంపులతో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నందున వాటి నివారణకు ప్రభుత్వం ఇటీవలే రూ.12కోట్లు మంజూరు చేసింది. క్రైస్తవ సంస్థ వారి నుంచి కొంత స్థలం సేకరించి ఒంపుగా ఉన్న రోడ్డును సాధారణంగా మార్చేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు భావిస్తున్నారు. ఆ పనులతో పాటు చెన్నారెడ్డి విగ్రహం నుంచి ధర్మవిద్యాలయం వరకు రెండు వైపులా బ్రిడ్జి మరమ్మతు పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కంకరతేలి ప్రమాదకరంగా మారిన బ్రిడ్జి (ఇన్‌సెట్‌లో) తొలగించిన గంగారం వెళ్లే మెట్లు

పేరుకుపోతున్న సమస్యలు

జేపీఎస్‌లు సమ్మెలో ఉన్నారు..
- అధికారులు, సభ్యులు సమష్టిగా పనిచేయండి
- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ విజయ్‌కుమార్

దౌల్తాబాద్: పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో ఉన్నారని, గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్న కారణంగా సర్పంచులు, అధికారులు కలిసికట్టుగా పనిచేసి సమస్యలు పరిష్కరించుకోవాలని ఎంపీపీ విజయ్‌కుమార్ సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో తొలుత ఏఓ లావణ్య వ్యవసాయశాఖ ఎజెండా చదివి వినిపించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ ప్రస్తుతం పంటల సాగు సీజన్ ఉండదని, గ్రామాల్లో ఏఈఓలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సర్పంచ్ శిరీష మాట్లాడుతూ దౌల్తాబాద్‌లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం సరిగా అందడం లేదని, అదే విధంగా పెద్దచెరువు తూమును మరమ్మతు చేయించాలని సంబంధిత అధికారులను ఆమె కోరగా.. ప్రస్తుతం జేపీఎస్‌ల సమ్మె కొనసాగుతున్నందున స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సమష్టిగా గ్రామాభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ పునరుద్ఘాటించారు. పీఆర్ఏఈ రవికిరణ్ మాట్లాడుతూ మండలంలో 12 గ్రామపంచాయతీ భవనాలు మంజూరయ్యాయని, ఆయా గ్రామాల్లో స్థలం సేకరించి భవనాలు నిర్మించుకోవాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీఓ తిరుమల స్వామి, డీటీ చాంద్‌పాష,, ఎంఈఓ వెంకటయ్య, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



సమావేశంలో సమస్యలు వివరిస్తున్న సర్పంచులు

ప్రజావాణిని వినియోగించుకోండి



బషీరాబాద్: అర్జీ తీసుకుంటున్న తహసీల్దార్

బషీరాబాద్: ప్రతి సోమవారం తహసీల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణిని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటస్వామి సూచించారు. ప్రజావాణిలో రైతుల నుంచి పలు అర్జీలు స్వీకరించిన అనంతరం తహసీల్దార్ మాట్లాడారు. రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై ఫిర్యాదు చేస్తే పరిష్కరిస్తామని చెప్పారు. మండలంలో ఇప్పటి వరకు 95 శాతం మేర భూ సమస్యలు పరిష్కరించామని, ఇంకా ఎవరికైనా రెవెన్యూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.



దోమ: రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్

సమస్యల పరిష్కారానికి చర్యలు

దోమ: ప్రజావాణిలో రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ తెలిపారు. తహసీల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రైతుల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. ప్రభుత్వం.. భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని, ఏ రైతుకు ఎలాంటి భూ సమస్య ఉన్నా వెంటనే ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు.

క్లుప్తంగా

పౌరులందరికీ రాజ్యాంగ పుస్తకం ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మల్లేశ్

పరిగి: పౌరులందరికీ భారత రాజ్యాంగ పుస్తకాన్ని ఉచితంగా అందజేయాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశ్ కోరారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజలకు రాజ్యాంగంపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కో కన్వీనర్ కృష్ణ మహరాజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

కొడంగల్: అంతారం గ్రామానికి చెందిన నర్సమ్మకు ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సోమవారం ఎల్‌ఓసీ పత్రాలు అందజేశారు. నర్సమ్మ వైద్య పరీక్షల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.లక్ష మంజూరు చేయించగా.. దానికి సంబంధించిన పత్రాలను హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

మనబడి పనులు పూర్తి చేస్తాం



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్ కుమార్

పరిగి: మనఊరు–మనబడి పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్ చెప్పారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి పరిసరాలను అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడారు. జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయని, వాటి ద్వారా తరగతి గదులు, వంట గదులు, మరుగుదొడ్లు, నీటి వసతి, విద్యుత్ దీపాలు, ఫ్యాన్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, ఎంపీడీఓ, ఎంఈఓ హరిశ్చందర్, కౌన్సిలర్లు అర్చన, ఎదిరే కృష్ణ, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు రాజేందర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీటి సరఫరా జరగాలి



హ్యాండ్ హెల్డ్ మిషన్స్‌ను సిబ్బందికి అందజేస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని ప్రతి ఇంటికీ తాగునీరు సరఫరా జరిగేలా సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని చైర్‌పర్సన్ మంజుల సూచించారు. సోమవారం కమిషనర్ శరత్ చంద్రతో కలిసి మున్సిపల్ సిబ్బందితో తాగునీటి సరఫరాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలకు వంద శాతం తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇక మీదట నల్లా బిల్లులు హ్యాండ్ హెల్డ్ మిషన్స్ ద్వారా వసూలు చేయాలని చెప్పారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఒకేసారి కట్టని పక్షంలో.. విడతల వారీగా చెల్లించే విధంగా ప్రజలకు చెప్పాలని సూచించారు. వంద శాతం నీటి పన్ను చెల్లించి పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఆమె కోరారు.

ముగిసిన ఈశ్వరాలయ వార్షికోత్సవం

యాలాల: ముద్దాయిపేట ఈశ్వరాలయ వార్షికోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఉదయం 6 గంటలకు గ్రామ ప్రధాన వీధుల్లో నంది కోలా నిర్వహించారు. శివనామస్మరణతో భక్తులు ఊరేగింపుగా తరలివెళ్లారు. అనంతరం గ్రామ శివారులో ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో నడిచి భక్తిని చాటుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రాజప్ప, సంగమేశ్వర్, వెంకటయ్య, దేవగారి రమేష్, పంతుల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జొన్న వేయడానికి జంకుతున్న రైతులు

- పందుల బెడద, గిట్టుబాటు లేక
- వాణిజ్య పంటలవైపు మొగ్గుచూపుతున్న వైనం
- సంప్రదాయ సాగుకు విముఖత

కొడంగల్: వ్యవసాయ రంగంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. నియోజకవర్గంలో రెండు దశాబ్దాలకు పైగా సంప్రదాయ పంటల సాగు క్రమంగా తగ్గిపోతోంది. వాణిజ్య పంటల వైపు రైతులు మొగ్గ చూపుతుండటం గమనార్హం. ధర్మం పంటగా పేరుగాంచిన జొన్నను వేయడానికి రైతులు జంకుతున్నారు. ఒకవైపు పందుల బెడద.. మరో వైపు గిట్టుబాటు ధర లేక.. జొన్న సాగుకు వెనుకడుగు వేస్తున్నారు. తక్కువ వ్యవధిలో అధిక దిగుబడి లాభాలు వచ్చే పంటలవైపు మొగ్గ చూపుతున్నారు. నియోజకవర్గంలో నాటి నుంచి కంది, జొన్న పంటలను అధిక మొత్తంలో సాగు చేస్తూ వస్తున్నారు. పంట మార్పిడి విధానంలో ఒక సంవత్సరం కంది వేస్తే మరో ఏడు జొన్న వేసేవారు. ఈ విధంగా ప్రతి సంవత్సరం రైతులకు దిగుబడి వస్తుండడంతో పాటు ఆహార ధాన్యాలకు లోటు ఉండేది కాదు. కందిపంట రైతులను ఆర్థికంగా ఆదుకోవడంతో కంది సాగు పెరిగింది. కాలక్రమేణా జొన్న, పెసర, మినుము పంటల సాగుకు రైతులు విముఖత చూపుతున్నారు. కారణం జొన్నకు పందుల బెడద ఎక్కువగా ఉంది. అంతేకాకుండా ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదనే కారణంతో జొన్నకు దూరం అవుతున్నారు. 2005 నుంచి 2023 మధ్య కాలంలో సాగు చేసిన పంటల వివరాలు ఇందుకు అద్దం పడుతున్నాయి. అంతేకాకుండా చిన్న పంటలైన పొద్దు తిరుగుడు, నువ్వులు, ఆముదం, వేరుశనగ, సజ్జ, ఉల్లి పంటలు సైతం అంతరించిపోయే దశలో ఉన్నాయి. అధిక పోషకాలు, ఔషధ, గుణాలు కలిగిన పాత పంటలు కొర్ర, రాగి, చామలు, నువ్వులు, గడి నువ్వుల సాగు పూర్తిగా కనుమరుగైంది.



జొన్న పంట

మైనార్టీల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

యాలాల: మైనార్టీల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కృషి చేస్తున్నారని, మండలానికి రూ.1.33 కోట్ల నిధులు మంజూరు చేశారని కోఆప్షన్ సభ్యుల సంఘం జిల్లా అధ్యక్షుడు అక్బర్‌బాబా తెలిపారు. మండల పరిధిలోని 20 గ్రామాల్లో మైనార్టీల శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మాణం, ఈద్గాల చుట్టూ ఫెన్సింగ్, మసీదుల్లో మరమ్మతు పనులకు ప్రత్యేక అభివృద్ధి నిధులు కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

మర్పల్లిలో ఇంటర్ సిటీ హాల్ట్

మర్పల్లి: కేంద్ర ప్రభుత్వం కృషితోనే ఇంటర్ సిటీ రైలు మంగళవారం మర్పల్లి రైల్వే స్టేషన్‌లో ఆగనుందని బీజేపీ మండల అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ పేర్కొన్నారు. ఇంటర్ సిటీ 2017 నుంచి బీదర్ నుంచి హైదరాబాద్, హైదరాబాద్ నుంచి బీదర్‌కు ఉదయం సాయంత్రం నడుపుతున్నారని, ఈ క్రమంలో మర్పల్లి రైల్వే స్టేషన్‌లో ఇంటర్ సిటీ రైలు ఆపాలంటూ బీజేపీ ఆధ్వర్యంలో పలు మార్లు వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు. అంతేకాకుండా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో కేంద్రం.. ఇంటర్ సిటీ రైలుకు మర్పల్లిలో హాల్ట్‌కు అనుమతి ఇచ్చిందని వెల్లడించారు.

ముగిసిన ఉత్సవాలు

పూడూరు: రాకంచర్లలో యోగానంద లక్ష్మీనృసింహస్వామి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు రోజున స్వామివారికి చక్రతీర్థం కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేద పండితులు, పూజారులు, ధర్మదాతలు, కమిటీ చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు, ఉత్సవాలకు సహకరించిన నాయకులను సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహులు, సర్పంచ్ కమ్లీబాయి పెంటయ్య, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి క్రీడాపోటీలు

తాండూరు రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 15,16,17వ తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చిన్నప్పల నాయుడు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చీఫ్ మినిష్టర్ కప్ 2023 పేరుతో అథ్లెటిక్స్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, పుట్ బాల్ పోటీలు సెయింట్ మార్క్స్ స్కూల్లో నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో ఎంపీపీ చైర్మన్, జెడ్పీటీసీ, ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ, ఎస్‌ఐ, పీఈటీలు సభ్యులుగా ఉంటారని తెలిపారు. కావున 15 సంవత్సరాల నుంచి 36 ఏళ్ల క్రీడాకారులు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

మర్పల్లిలో..

మర్పల్లి: ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు మండల కేంద్రంలోని గ్రామీణ క్రీడా ప్రాంగణంలో క్రీడా పోటీలు జరగనున్నాయని ఎంపీడీఓ రాజ్ మల్లయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ చీఫ్ మినిస్టర్ కప్ 2023లో భాగంగా మండల స్థాయిలో వంద మీటర్ల పరుగు పందెం, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు ఉంటాయని, ఫుట్‌బాల్ టోర్నీ పురుషులకు మాత్రమే నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 11 వరకు మండల పరిషత్ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రాణసంకటం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రవిగౌడ్

కొడంగల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే ప్రాణ గండమని ఎస్‌ఐ రవిగౌడ్ అన్నారు. సోమవారం సాయంత్రం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వాహనాలను తనిఖీ చేశారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారుల నుంచి 43 వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వారికి బస్టాండ్ ఆవరణలో అవగాహన కల్పించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేయరాదని, ప్రమాదం జరిగి ప్రాణాలు పోతే కుటుంబ సభ్యులకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఎన్ని డబ్బులు పెట్టినా ప్రాణాలు తిరిగి రావని, ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష అని చెప్పారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులే బాధ్యత వహించాల్సి ఉంటుందని, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు నడపరాదని, మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. అనంతరం హెల్మెట్ తీసుకొచ్చిన వారికి వాహనాలను అప్పగించారు.

ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష: ఎస్‌ఐ

విధిగా హెల్మెట్ ధరించాలి

ధారూరు: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని ధారూరు సర్కిల్ సీఐ అప్పయ్య సూచించారు. తాండూర్–హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై ఆయన ఎస్‌ఐ సంతోష్‌కుమార్, సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురై ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని చెప్పారు. హెల్మెట్ పెట్టని వారికి జరిమానాలు విధిస్తున్నామని, ఒకటి, రెండుసార్లు జరిమానాల తర్వాత కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

వంతెన నిర్మాణానికి అనుమతులు

- హర్షం వ్యక్తంచేస్తున్న గ్రామస్తులు
- ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి కృషి ఫలితమే: సర్పంచ్

తాండూరు రూరల్: తాండూరు మండలం బొంకూర్–బిజ్వార్ వంతెన నిర్మాణానికి పంచాయతీరాజ్ విభాగం అనుమతులతో పాటు, నిర్మాణానికి రూ.4.50 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి జీఓ వచ్చిందని డీఈ వెంకట్రావ్ తెలిపారు. బిజ్వార్ గ్రామానికి వెళ్లాలంటే కాగ్నానది దాటాల్సి ఉంది. వర్షాకాలం వస్తే బొంకూర్ గ్రామస్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తుంటారు. గతంలో వాగు ప్రవహించడంతో తాండూరుకు వెళ్లలేని పరిస్థితి. వాగు ఉధృతి వలన అనారోగ్యానికి గురైన వారు ఆసుపత్రులకు వెళ్లలేని స్థితిలో పలువురు మృత్యువాత పడ్డారు. దీంతో అప్పట్లో ఆందోళనలు చోటుచేసుకున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వెళ్లలేని దుస్థితి. కొన్నేళ్లుగా వంతెన నిర్మాణం కొరకు సర్పంచ్, గ్రామస్తులు అనేక సార్లు పాలకులు, అధికారులకు విన్నవించారు. తాజాగా ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి చొరవతో పంచాయతీరాజ్ విభాగం నుంచి నిధులు మంజూరయ్యాయి. టెండర్లు పిలిచి త్వరలో పనులు ప్రారంభం కానున్నట్లు స్థానికులు తెలిపారు. వంతెన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యేకు సర్పంచ్ నరేందర్ రెడ్డి, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

దళితులపై దాడి అమానుషం

ఖండించిన దళిత, ప్రజా సంఘాలు

బొంరాస్‌పేట: ఉత్సవాల్లో దళితుల పట్ల నేటికీ వివక్షత కొనసాగుతూనే ఉందని ప్రజాసంఘాల నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. దుద్యాల మండల పరిధిలోని హకీంపేటలో బొడ్రాయి పండుగలో దళితులపై జరిగిన దాడిని ఖండిస్తున్నామన్నారు. ఈ మేరకు సోమవారం ఘటనా స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆదివారం గ్రామంలో నాలుగు చోట్ల బొడ్రాయిల ఏర్పాటు ఉత్సవం జరిగిందని, అందులో భాగంగా ఎస్సీ కాలనీ ప్రతిష్ఠాపనోత్సవంలో దళితేతర మహిళలు కొందరు మాదిగలను దూషించారని చెప్పారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని చెప్పారు. ఇదిలా ఉండగా దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు.



పోలీసులతో మాట్లాడుతున్న నాయకులు

దేశం మెచ్చే సంక్షేమ పథకాలు

- పేదలకు కల్యాణలక్ష్మి ఓ వరం
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న నేతలు

కుల్కచర్ల: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలనను అందిస్తుందని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో 140మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. పేద ప్రజల ఇబ్బందులు గ్రహించిన సీఎం కేసీఆర్ ప్రతి ఇంటి ఆడబిడ్డ ఇబ్బందిని తన ఇబ్బందిగా భావించి, వారి వివాహం కుటుంబానికి భారంకావద్దని కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకం ప్రవేశ పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, తహసీల్దార్ రమేష్ కుమార్, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, పాంబండ ఆలయ చైర్మన్ రాములు, సొసైటీ డైరెక్టర్ కొండయ్య, నాయకులు జోగు వెంకటయ్య, కృష్ణయ్య, శ్రీనివాస్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనంద్

- అర్హులందరికీ పథకాలు
- ఎమ్మెల్యే ఆనంద్

బంట్వారం: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. మీతో నేను కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన బంట్వారంలో పర్యటించి, స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు పెద్ద ఎత్తున అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. అనంతరం మండలానికి సంబంధించిన 31 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆలంపల్లి లావణ్య, ఎంపీటీసీ పద్మ, జెడ్పీటీసీ సంతోష, ఎంపీడీఓ బాలయ్య, తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, పలు శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జాతర జరుపుకోవడం సంతోషం

మోమిన్‌పేట: గ్రామాల్లో జాతర మహోత్సవాలు జరుపుకోవడం సంతోషకరమని ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడెంలో జరిగిన బీరప్ప జాతర మహోత్సవానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

పొదుపు సంఘాలు ప్రగతికి నిలయాలు

బంట్వారం: పొదుపు సంఘాలు ఆర్థిక పరిపుష్టి సాధించి, ప్రగతికి నిలయాలుగా మారాలని ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ సూచించారు. మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ట్రాక్టర్‌ను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. బ్యాంక్ రుణాన్ని వాయిదాల ప్రకారం చెల్లిస్తూ లాభాలు ఆర్జించేలా ట్రాక్టర్‌ను నడిపించుకోవాలని సంఘం సభ్యులకు సూచించారు. జెడ్పీటీసీ సంతోష, ఎంపీడీఓ పాల్గొన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించి మోసపోవద్దు

దౌల్తాబాద్: రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ధాన్యం దళారులకు విక్రయించి నష్టపోవద్దని జెడ్పీటీసీ మహిపాల్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అంతారం, బాలంపేట, తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులకు కేంద్రాల వద్ద ఇబ్బందులు రాకుండా చూడాలని నిర్వాహకులను కోరారు. కార్యక్రమంలో సీఈఓ అనంతయ్య, సర్పంచులు శ్రీకాంత్‌రెడ్డి, మంజుల, ఏఈఓలు ప్రమీల, శ్రీపతిరెడ్డి, వినోద్ తదితరులున్నారు.

నేడు ప్రారంభం

కొడంగల్: నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించనున్నారని ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో అంగడిరాయిచూర్, చిట్లపల్లి, చిన్ననందిగామ, దౌల్తాబాద్ మండల కేంద్రం, దుద్యాల మండలం లగచర్ల, గౌరారం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు.



దౌల్తాబాద్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలని రైతు సంఘం మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుంకిమెట్ల, బాపల్లితండాలో డీసీఎంఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధరకు సేకరిస్తుందని, ఈ కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని చెప్పారు. మంగళవారం దుద్యాల, చిల్మల్‌మైలారం తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి కొనుగోళ్లు ప్రారంభిస్తారని తెలిపారు. ఎంపీపీ హేమీబాయి తదితరులు పాల్గొన్నారు.